సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



**విద్యార్థుల సృజనాత్మకత**
కోదాడలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రాజెక్టులతో సృజనాత్మకత ప్రదర్శించారు. - 8లో



**చెడు వ్యసనాలకు బానిసై..**
చెడు వ్యసనాలకు బానిసగా మారిన యువకుడు గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కాడు. - 8లో



**పరిష్కారం చూపాలి**
తిరుమలగిరి(సాగర్) మండలంలో భూ సమస్యలకు పరిష్కారం చూపాలని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : నల్లగొండకు ఈ నెల 20న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి 10.30 గంటలకు నల్లగొండకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 వరకు నల్లగొండలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి సాయంత్రం 6.30కు హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

### పాలిటెక్నిక్‌లో ఐటీఐ విద్యార్థులకు ప్రవేశాలు

నల్లగొండ : ఐటీఐ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం డిప్లొమా కోర్సు (బ్రిడ్జి కోర్సు)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ ప్రభుత్వ బాలికల న్యూ ఐటీఐ ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఐటీఐ (ఇంజినీరింగ్ (ఎన్‌సీవీటీ) కోర్సు 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు ఈ నెల 18 నుంచి జనవరి 30వ తేదీ వరకు నల్లగొండ ప్రభుత్వ బాలికల న్యూ ఐటీఐ కాలేజీలో సంప్రదించాలని పేర్కొన్నారు. అర్హత ఇతర వివరాలకు 8919234137 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### శ్రీనిధి రుణాలు రికవరీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

గుర్రంపోడు : శ్రీనిధి రుణాలు వంద శాతం రికవరీ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడులో సెర్ప్ కార్యక్రమాలపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లింకేజీలో వందశాతం రుణాల మంజూరు చేయాలని సూచించారు. ఇందిరా మహిళాశక్తి కింద పాడిగేదెలు ఇప్పించాలని, సంఘాల్లో సభ్యులందరికి రుణబీమా, ప్రమాద బీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఎం వరికుప్పల యాదయ్య పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : ఇందిరమ్మ మహిళా శక్తి పథకానికి మైనార్టీ మహిళలు (ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైన్స్, పార్సిస్ మతాల వారు) ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి.విజయేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ, నిరుపేద, విడాకులు తీసుకున్న, వితంతు, అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రం, వయసు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉన్నట్లు తెలిపే ధ్రువీకరణపత్రం, ఓటరు ఐడీ, ఆధార్‌కార్డు, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా పొందిన టైలరింగ్ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించారు. ఒక కుటుంబానికి/ఇంటికి ఒక కుట్టు మిషన్ మాత్రమే ఇస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు కనీస విద్యార్హత 5వ తరగతి ఉండాలని తెలిపారు.

### 2,38,529 టన్నుల ధాన్యం కొనుగోలు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

గుర్రంపోడు : జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 2,38,529 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం గుర్రంపోడు మండలంలోని చామలేడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. 1,92,969 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 45,560 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం ఇప్పటి వరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ధాన్యం ఇక్కడి కేంద్రాలకు తరలించకుండా గట్టి నిఘా ఉంచామన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన..**

మండలంలోని జూనూతుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను పరిశీలించారు. వివరాలను యాప్‌లో నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి గ్రామ కార్యదర్శికి తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ హరీష్, ఎంపీడీఓ మంజుల, ఆర్ఐ రావుల సైదులుగౌడ్ ఉన్నారు.



రన్నింగ్ చేస్తున్న క్రీడాకారులు



తైక్వాండో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

## క్రీడలతో మానసికోల్లాసం

నల్లగొండ టూటౌన్ : క్రీడా పోటీల ద్వారా యువత మానసికంగా ఉల్లాసంగా ఉండవచ్చని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం నల్లగొండ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగ్జీవన్‌రావు, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఇందిర, విమల, శంభులింగం, యూనుస్, ఏకస్వామి, రమేష్, ప్రణీత్, నాగరాజు, మాణిక్యం, గఫార్, షరీఫ్, అష్రఫ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు మోక్షం

## ధరణి స్థానంలో 'భూభారతి' తెస్తున్న ప్రభుత్వం

- జిల్లాస్థాయిలో నాలుగు అంచెల్లో పరిష్కారం
- తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలోనే ఎక్కువ శాతం..
- క్లిష్టమైన సమస్యలకు సీసీఎల్‌ఏ పరిధిలోనే..
- జిల్లాలో 7 వేలకుపైగా పెండింగ్ దరఖాస్తులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భూ సమస్యలకు మోక్షం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన భూ భారతి (ఆర్ఓఆర్) -2024 బిల్లు త్వరలోనే చట్టం కానుంది. ఈ చట్టం అమలైతే భూ సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయి. మొన్నటి వరకు ఉన్న ధరణితో ఎలాంటి భూ సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకుంటే అది కలెక్టర్ లాగిన్‌కు వచ్చేది. వందలాది సమస్యల దరఖాస్తులు కలెక్టర్ లాగిన్‌లో ఉండేవి. సీరియల్ పద్ధతిన ఆ సమస్య తీవ్రతను బట్టి కలెక్టర్ పరిష్కరించేవారు. దీంతో చాలా జాప్యం జరిగేది. ప్రస్తుతం తీసుకొస్తున్న భూ భారతి చట్టం ద్వారా జిల్లా స్థాయిలోనే నాలుగు అంచెల్లో అంటే.. తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో మొత్తంగా జిల్లాలోనే భూ సమస్యలకు పరిష్కారం లభించనుంది. అత్యంత క్లిష్టమైన సమస్యలను మాత్రం సీసీఎల్‌ఏ స్థాయిలో పరిష్కరించనున్నారు.

**జిల్లాస్థాయిలో నాలుగు అంచెల్లో..**

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి చట్టం ద్వారా నాలుగు అంచెల్లో సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడింది. మండలస్థాయిలో తహసీల్దార్‌కు కొన్ని బాధ్యతలు, ఆ తర్వాత డివిజన్ స్థాయిలో ఆర్డీఓకు మరికొన్ని, ఆపై కొన్ని సమస్యలను అదనపు కలెక్టర్‌కు ఇంకా ముఖ్యమైన సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేందుకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం జిల్లాలో 7 వేలకు పైగా పెండింగ్ సమస్యలు ఉండగా, 13 వేలకు పైగా సాదాబైనామాలు ఉన్నాయి. ప్రస్తుతం వాటన్నింటికి భూభారతిలో పరిష్కారం లభించనుంది.

**తహసీల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యేవి..**

- టీఎం-4 మాడ్యూల్‌లో ఫౌతి చేయడం.
- అసైన్డ్ భూములను కూడా ఫౌతి చేసే అధికారం.
- మాడ్యూల్ టీఎం-10 పరిధిలో జీపీఏ, ఎస్‌పీఏ అమలు చేయడం.
- మాడ్యూల్ టీఎం-14లో ఆధార్ తప్పిదాలను సరి చేయడం, ఆధార్ లేని వాటిని సరి చేయడం, భర్త, తండ్రి పేర్లు తప్పుగా ఉంటే సరి చేయడం, ఫొటో మిస్ మ్యాచింగ్, జెండర్ తప్పిదాలు, కులం తప్పుగా పడినా, సర్వే నంబర్ తప్పుగా పడినా వాటిని సరి చేయడం.
- మాడ్యూల్ టీఎం-32 ఖాతాల విలీనం కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడం.

**ఆర్డీఓ స్థాయిలో..**

- మాడ్యూల్ టీఎం-7 పరిధిలో పాస్‌బుక్‌లు లేకుండా నాలా కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కరం.
- కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించిన ఫిర్యాదులు, ఎన్ఆర్ఐ పోర్టల్, టీఎం-22 మాడ్యూల్ పరిధిలో ఉన్న ఏదేని సంస్థ ద్వారా పట్టాదార్ పాస్ పుస్తకం కోసం దరఖాస్తుల పరిష్కారం.
- పెండింగ్‌లో ఉన్న నాలా దరఖాస్తుల పరిష్కారం.
- రూ.5 లక్షలలోపు వ్యాల్యూ ఉన్న మిస్సింగ్ సర్వే నంబర్లు, సబ్ డివిజన్లు, రూ.5 లక్షల లోపు విలువ కలిగిన విస్తీర్ణాన్ని సరి చేయడం.

**అదనపు కలెక్టర్ స్థాయిలో..**

- టీఎం-3 మాడ్యూల్ పరిధిలో మ్యుటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులను రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా మ్యుటేషన్ చేయడం.
- టీఎం-24 మాడ్యూల్ పరిధిలో కోర్టు ఆర్డర్ ఆధారంగా పట్టాదార్ పాస్ పుస్తకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారం.
- పట్టాదారు పాస్‌బుక్ లేదా నాలా మార్పిడి వంటి వాటిల్లో పేరు, ఇంటి స్థలం తప్పుగా చూపిన వాటి సమస్యల పరిష్కారం.
- పేరు మార్పుపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం.

**కలెక్టర్ స్థాయిలో..**

- మాడ్యూల్ టీఎం-15 పరిధిలో నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడానికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం.
- పట్టాదారు పాస్‌బుక్, సెమీ అర్బన్ ల్యాండ్ కోసం వచ్చిన దరఖాస్తులు, ధరణి కంటే ముందు కొంత భూమి అమ్మి ఆ తర్వాత పాస్‌బుక్‌లు జారీ కాని సమస్యలను పరిష్కరిస్తారు.
- ధరణి కంటే ముందు నాలా భూమి నుంచి వ్యవసాయ భూమిగా మార్పిడి జరిగిన వాటికి సంబంధించిన ఫిర్యాదులు.
- రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షలలోపు విలువ ఉన్న భూములకు సంబంధించి విస్తీర్ణాన్ని సరి చేయడం.

**సీసీఎల్‌ఏ పరిధిలో..**

- అన్ని రకాల నోషనల్ ఖాతా నుంచి పట్టాను బదిలీ చేయడం.
- భూముల రకాల్లో తప్పుపడిన వాటిని సరి చేయడం.
- ఎంజాయ్‌మెంట్‌లో పొరపాట్లను సరిచేయడం.
- రూ.50 లక్షల విలువ ఉన్న వాటి పరిధిలోని విస్తీర్ణాన్ని సరిచేయడం.
- రూ.50 లక్షలకు పైగా విలువైన భూమికి సంబంధించిన మిస్సింగ్ సర్వే నంబర్, సబ్ డివిజన్ల మార్పునకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం.

## పారిశుద్ధ్య కార్మికులపై కాంట్రాక్టర్ వేధింపులు



ఎంసీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- నల్లగొండ జీజీహెచ్‌లో రాత్రి వేళ ఫొటోలు తీసిన సూపర్‌వైజర్
- ఎందుకని ప్రశ్నిస్తే.. విధుల్లో నుంచి తొలగించిన కాంట్రాక్టర్
- ఎంసీహెచ్ ఎదుట కార్మికుల ఆందోళన

నల్లగొండ టౌన్ : నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓ కాంట్రాక్టర్ పారిశుద్ధ్య కార్మికులను వేధింపులకు గురిచేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి పది గంటల సమయంలో జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ వార్డుల్లో పనులు చేస్తున్న కార్మికులను వేరే భవనానికి సంబంధించిన సూపర్‌వైజర్ వచ్చి ఫొటోలు తీశాడు. రాత్రి సమయంలో ఎందుకు ఫొటోలు తీస్తున్నారని కార్మికులు ఆయనతో వారించారు. దీనికి సూపర్‌వైజర్ వెంటనే కాంట్రాక్టర్‌కు ఫోన్లో సమాచారం ఇవ్వడంతో పదిన్నర తరువాత అసుపత్రికి వచ్చిన కాంట్రాక్టర్ వెంటనే మహిళ కార్మికులు వేచి ఉండే గదికి వెళ్లాడు. ఆస్పత్రి నాది నా ఇష్టం వచ్చిన వారు ఇక్కడ డ్యూటీలు చేస్తారు.. మీరు ఎవరూ? అంటూ వారిపై కేకలు వేశాడు. వెంటనే సబిత అనే కార్మికురాలితో 'నిన్ను విధుల్లో నుంచి తొలగిస్తున్నాను.. రేపటి నుంచి రావద్దు.. 70 మందిని తీసేస్తే నాకు మరో 70 మంది వస్తారు. 70 లక్షలు వస్తాయి' అంటూ దుర్భాషలాడాడు. దీంతో మహిళ కార్మికురాలు ఎంత బతిమాడిని వినకుండా వెళ్లిపోవాలని హుకుం జారీ చేశాడు. దీంతో సదరు కార్మికురాలు ఉద్యోగం పోయిందని తీవ్ర మనోవేదనకు గురికావడంతో ఆమె బీపీ 200కు పెరిగి కింద పడిపోయింది. వెంటనే అక్కడున్న మిగతా సిబ్బంది ఆమెను అదే ఆస్పత్రిలో చికిత్స కోసం జాయిన్ చేశారు. దీంతో ఉదయం 7గంటల ప్రాంతంలో డ్యూటీ షిఫ్టింగ్ సమయంలో మిగతా కార్మికులు అందరూ వచ్చారు. ఈ విషయం బయటకు రావడంతో కాంట్రాక్టర్ వేధింపులకు నిరసనగా పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఉదయం తమ విధులను బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. అర్ధరాత్రి సమయంలో చాలాసార్లు వచ్చి ఇలా వేధింపులకు గురిచేస్తాడని, ఉదయం నుంచే విధులకు రావద్దంటూ ఆదేశాలు ఇస్తారని.. తాగివచ్చి కూడా అనేకమార్లు ఇష్టనుసారంగా మాట్లాడుతారని కార్మికులు ఆరోపించారు. వెంటనే కాంట్రాక్టును రద్దు చేసి తగిన న్యాయం చేయాలని వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి పదిన్నర వరకు ఎంసీహెచ్ మెయిన్ గేట్ ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి కార్మికులను పిలిచి ఆందోళన విరమించాలని కోరారు. కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లు ప్రతిసారి ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తారని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికురాలి పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి వెంటనే సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.

## ఐటీ టవర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ



నల్లగొండ ఐటీ టవర్‌ను పరిశీలిస్తున్న ఐటీ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, కలెక్టర్

నల్లగొండ : నల్లగొండ ఐటీ టవర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి నల్లగొండలోని ఐటీ టవర్‌ను సందర్శించారు. ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణకు ఉద్యోగులను గుర్తించడంతోపాటు, 20 బ్యాచ్‌లుగా విభజించాలని కలెక్టర్‌ఉ సూచించారు. ఐటీ టవర్‌లో జపాన్‌కు చెందిన ఓ కంపెనీ 500 మంది ఉద్యోగులతో తన కార్యకలాపాలను ప్రారంభించనుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, ఐటీ టవర్ మేనేజర్ నాగరాజు, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ పాల్గొన్నారు.

## బ్యాంకర్లు పోలీసులకు సహకరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్




మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : సైబర్ బాధితులకు తక్షణ సాయం అందజేసేందుకు బ్యాంకర్ల సహకరించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణపై బ్యాంకు అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతి బ్యాంకు వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ బాధితులు కోల్పోయిన డబ్బు రీఫండ్ అయినప్పుడే వారిలో పోలీసులపై నమ్మకం పెరుగుతుందన్నారు. కొందరు దళారులు వివిధ స్కీమ్‌లతో ప్రజలకు రుణాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్నారని అలాంటి వారిని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో రిపోర్టు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు రమేష్, శివరాంరెడ్డి, లక్ష్మీనారాయణ, సీఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నల్లగొండ క్రైం : పండుగలకు ఇల్లు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పక్క ఇంటి వారికి సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్ర పరుచుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోస్‌కు కనెక్షన్ చేసుకోవాలని.. అనుమానితులు కాలనీల్లో తిరిగితే 100 నంబర్ సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

## 21న జాబ్ మేళా

నల్లగొండ : నల్లగొండలోని ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డి.ఫార్మసి, బి.ఫార్మసి, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు అర్హులని తెలిపారు. బయోడేటాతో నేరుగా ఉపాధి కల్పన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేతనం ఉంటుందని తెలిపారు. వివరాలకు 7095612963 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఐఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

నల్లగొండ : మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (పీఎంటీఏ టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ కోరారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం విధులకు హాజరవుతూనే భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం 6వ రోజు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై.. సాయంత్రం డీఐఈఓ, డీఈఓకు వినతిపత్రాలు అందిచామని తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకొని మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని, 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమాల్లో ఖలీల్ అహ్మద్, సయ్యద్ సలీం, అక్కినెపల్లి శ్రీనివాస్, అనిల్కుమార్, భద్రయ్య, ఫసి అహ్మద్, కొండల్, వరలక్ష్మి వజీహ తబస్సుం, రవీందర్, విజయ్, లూర్దు రెడ్డి పాల్గొన్నారు.

# గాడితప్పిన మున్సిపల్ పాలన

- 11 నెలలుగా జరగని మిర్యాలగూడ కౌన్సిల్ సమావేశం
- ఆధిపత్య పోరుతో మూడుసార్లు వాయిదా
- వచ్చే నెలలో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న అధికార పార్టీ కౌన్సిలర్లు (ఫైల్)

మిర్యాలగూడ: పచ్చదనం-పరిశుభ్రత నిర్వహణలో జాతీయ స్థాయిలో అవార్డు పొంది రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిన మిర్యాలగూడ మున్సిపాలిటీలో పాలన గాడితప్పిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. మున్సిపల్ పాలకవర్గంలోనూ మెజారిటీ సభ్యులు అధికార పార్టీలో చేరడంతో ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఏడాది క్రితం వరకు ప్రతిపక్షంలో ఉన్న నేత ప్రస్తుతం నియోజవర్గానికే ప్రజాప్రతినిధిగా గెలుపొందడంతో ప్రస్తుతం మున్సిపాలిటీలోనూ ఆయన పెత్తనమే సాగుతోంది. దీంతో మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు ఉన్నాయి.


**11నెలలుగా జరగని మున్సిపల్ సమావేశం**

2024 ఫిబ్రవరిలో జరిగిన మున్సిపల్ సమావేశం 11నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. ఏప్రిల్, మే నెలలో పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆ సమయంలో సమావేశం నిర్వహించేందుకు వీలు కాలేదు. ఎన్నికల తరువాత సమావేశం నిర్వహించడంలో ఆధిపత్య పోరు అడ్డుతగిలింది. ఒకరికి తెలియకుండా ఒకరు సమావేశ తేదీలను ప్రకటించడంతో ఆయా ప్రజాప్రతినిధుల అనుచర వర్గాలు సమావేశాలు జరగకుండా అడ్డు తగిలారు. ఇప్పటి వరకు మూడుసార్లు సమావేశాలు పెట్టినప్పటికీ సరైన కోరం లేకపోవడంతో వాయిదా వేయాల్సి వచ్చింది. చివరగా నవంబర్‌లో సమావేశం నిర్వహించినప్పటికీ అధికార పార్టీకి చెందిన 22 మంది కౌన్సిలర్లు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపి సమావేశాన్ని బైకాట్ చేశారు. చివరికి ఈ సమావేశం కూడా వాయిదా పడింది. మరో నెల రోజుల్లో కౌన్సిల్ పాలకవర్గ పదవీకాలం ముగియనుండడంతో ఈనెల చివర లేదా వచ్చే నెలలో సమావేశం పెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ సమావేశాన్ని సైతం నడవకుండా ఉండే విధంగా అధికార పార్టీలోనే రెండు వర్గాల కౌన్సిలర్లు ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి.

**ఆమోదానికి నోచుకోని ఎజెండా..**

అనేక అంశాలపై ఎజెండాను ప్రతిపాదించినప్పటికీ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం పొందడం లేదు. మొత్తం 60 అంశాలపై అజెండాను రూపొందించి సమావేశాల్లో ప్రస్తావించగా అందులో కేవలం మున్సిపల్ చెత్త సేకరించే ఆటో డ్రైవర్లకు మాత్రమే జీతాలు ఇవ్వాలని, ఆ ఒక్క అంశానికే ఆమోదం తెలిపినట్లు మిగిలిన అంశాలను వ్యతిరేకించారు. దీంతో అనేకమార్లు ఆ అజెండా ఆమోదం పొందకుండానే పోయింది. ఇందులో ప్రధానంగా డంపింగ్ యార్డులో వర్మికంపోస్ట్ తయారు చేసి దాని ద్వారా ఆదాయం పొందే మార్గం ఉంది. అదేవిధంగా పట్టణంలో పెండింగ్‌లో డ్రెయినేజీ, రోడ్లు, వీధిదీపాల పనులు, అమృత్ పథకం కింద 11 నీటి ట్యాంకుల ఏర్పాటు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీతతోపాటు అనేక ప్రధాన అంశాలు ఉన్నాయి. అవన్ని కూడా 11 నెలలుగా ఇప్పటివరకు ఆమోదం పొందలేకపోతున్నాయి. దీంతో అధికారులు ఏంచేయాలో తోచని పరిస్థితిలో ఉన్నారు.

**సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాం..**



గత 11నెలలుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరగని విషయం వాస్తవమే. మూడు సార్లు సమావేశం జరిపాం. సభ్యుల నిరసనలు, కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశాం. త్వరలో సమావేశం నిర్వహించి అజెండా ఆమోదం పొందే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం.

– ఎండీ.యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

## క్లుప్తంగా

### అన్నిరకాల భూ సమస్యలకు పరిష్కారం చూపాలి

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

నాగార్జునసాగర్: రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన తిరుమలగిరి(సాగర్) మండలంలో అన్నిరకాల భూ సమస్యలకు పరిష్కారం చూపాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరితగతిన భూ సర్వే పూర్తి చేయాలని సూచించారు. కాందిశీకుల భూములతో పాటు అసైన్డ్, పోరంబోకు, అటవీ, సాదాబైనామా, విరాసత్, రెవెన్యూ, గ్రామకంఠం, బంజరు తదితర భూముల్లో సర్వే చేయాలని కోరారు. సేద్యంలో ఉన్న భూములను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఏడీ శ్రీనివాస్, డివిజనల్ సర్వేయర్ రమణయ్య, రమాకాంత్, వెంగళరావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నల్లగొండ టూటౌన్ సీఐ మల్టీ జోన్-2కు అటాచ్

నల్లగొండ క్రైం: నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్‌ను మల్టీ జోన్-2కు అటాచ్ చేస్తూ గురువారం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. తన భార్యతో సీఐ డానియల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా సీఐని మల్టీ జోన్-2కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**పోస్టింగ్ కోసం పెరిగిన డిమాండ్..**

టూటౌన్ సీఐగా పోస్టింగ్ పొందేందుకు పలువురు సీఐలు తీవ్రంగా పోటీ పడుతున్నట్లు సమాచారం. జిల్లాలో పనిచేస్తున్న సీఐలు, గతంలో ఇక్కడ పనిచేసిన వారు అధికారులను, రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడుతున్నట్లు చర్చ జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో విధి నిర్వహణలో ఇబ్బంది పడుతున్న పలువురు సీఐలు, టూటౌన్ సీఐగా పోస్టింగ్ తీసుకునేందుకు అనేక మార్గాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

# విద్యార్థుల సృజనాత్మకత భళా

- విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న ఎగ్జిబిట్లు

కోదాడ: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు తమలోని సృజనాత్మకతకు పదునుపెట్టి తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన కొన్ని ఎగ్జిబిట్లు ఇవీ..



వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్ల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

### కుండలతో శుద్ధ జలం తయారీ



తక్కువ ఖర్చుతో శుద్ధ జలాన్ని సులువుగా తయారుచేసుకోడానికి దొండపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రఘునాథ్, అరవింద్ గైడ్ ఎస్‌కె. మస్తాన్ ఆధ్వర్యంలో తయారుచేసిన మూడు కుండల ప్రాజెక్ట్ ఆకట్టుకుంది. మూడు కుండలను ఒకే వరుసలో ఒకదాని మీద ఒకటి క్రమపద్ధతిలో అమర్చి వర్షపు నీటిని పైకుండలోకి వదులుతారు. దీనిలో రాళ్లు, చార్‌కోల్, ఇసుకను పొరలుగా ఏర్పాటు చేస్తారు. వర్షపు నీరు మొదటి కుండలో శుద్ధి చేయబడి రెండో కుండలోకి చేరుతుంది. అక్కడ మరోసారి శుద్ధి అయ్యి మూడో కుండలోకి వస్తుంది. దానికి ట్యాప్ అమర్చి శుద్ధమైన నీటిని తాగవచ్చని విద్యార్థులు తెలిపారు.

### బస్ ఐడెంటిఫికేషన్ డివైస్‌తో అంధులకు ఉపయోగం

బస్టాండ్లలో అంధులు బస్సులు ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్తున్నాయో సులువుగా తెలుసుకునేలా ఆత్మకూరు(ఎస్) మండలం కందగట్ల ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎల్. రుషినాథ్ క్యూఆర్ కోడ్ టికెట్‌ను రూపొందించాడు. బస్ టికెట్ తీసుకొనే సమయంలో క్యూఆర్ కోడ్ ముద్రించిన టికెట్ ఇస్తారు. దానిని తీసుకొని బస్ వద్దకు వెళ్లగానే క్యూఆర్ కోడ్‌ను బస్సులో సెన్సార్ స్కాన్ చేసి ఆ బస్సు ఎక్కడికి వెళ్తుందో స్పీకర్‌లో వినిపిస్తుంది. ఉపాధ్యాయుడు వి. శ్రీనివాస్ గైడెన్స్‌లో విద్యార్థి రుషినాథ్ ఈ ప్రయోగం చేశాడు.



### విత్తనాలు విత్తేందుకు సౌలభ్యంగా..



రైతులు విత్తనాలు విత్తుకోవడానికి ఎంతో ఉపయోగపడే పరికరాన్ని గోండ్రియాల ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి టి. జగన్ రూపొందించాడు. ఈ పరికరం ఒక విత్తనానికి మరో విత్తనానికి సమదూరం ఉండే విధంగా భూమిలోకి వదులుతుంది. దీని వల్ల విత్తనాలు ఒకే దగ్గర పడకుండా సమదూరంలో పడి మొలకెత్తుతాయని గైడ్ ఆర్. విజయ్ తెలిపారు. తక్కువ ఖర్చుతో రైతులు దీన్ని తయారుచేసుకోవచ్చని అంటున్నారు.

### చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా నల్లాలు

బహిరంగ ప్రదేశాల్లో, ఫంక్షన్ హాల్స్‌లో తాగునీటి నల్లాలు ఎక్కువ ఎత్తులో ఉండడం వల్ల చిన్నపిల్లలు నీరు తాగడానికి ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యను పరిష్కరించడానికి నాగారం మండలం వర్ధమానుకోట హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జి. మధుప్రియ, మణిందర్ గైడ్ గోవర్ధన్ సూచనలతో తయారుచేసిన నల్లాల అమరిక ప్రాజెక్ట్ ఆకట్టుకుంది. అన్ని నల్లాలను ఒకే ఎత్తులో కాకుండా రెండు మూడు ఎత్తులలో అమర్చడం వల్ల చిన్నారులు సులువుగా నీరు తాగే అవకాశం ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు.




### బరువులను సులువుగా మోసేలా వీల్ ట్రాలీ



పైఅంతస్తుల్లో ఉండే వారు బరువైన వస్తువులను మెట్ల మీద నుంచి సులువుగా తీసుకెళ్లేందుకు వీలుగా పెన్‌పహాడ్ మండలం లింగాల ప్రభుత్వ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జె. స్నేహిత వీల్ ట్రాలీ తయారుచేసి ప్రదర్శించింది. ఈ వీల్ ట్రాలీతో మెట్లమీద నుంచి గ్యాస్ సిలిండర్, ఇతర బరువైన వస్తువులను సులువుగా తీసుకెళ్లవచ్చు. ఈ ఎగ్జిబిట్‌ను పలువురు మెచ్చుకున్నారని గైడ్ జి. రవిబాబు తెలిపారు.

### లెక్కలు సులభంగా అర్థమయ్యేలా..



కోదాడ మండల పరిధిలోని తమ్మరబండపాలెం జెడ్పీహెచ్ఎస్‌కు ఉపాధ్యాయుడు ఎస్. ఫణికుమార్ విద్యార్థులతో కలిసి లెక్కలు సులువుగా అర్థం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అట్టముక్కలకు రంగులు అద్ది తక్కువ ఖర్చుతో తయారు చేసిన మోడల్స్‌ను విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆసక్తిగా గమనించారు

## ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలకు నిధులు

- అసెంబ్లీలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం
- బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు మరో రూ.70 కోట్లు ఇవ్వాలని అభ్యర్థన



అసెంబ్లీలో మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలోని ధర్మారెడ్డి కాల్వ పూర్తిచేయడానికి రూ.129 కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.95కోట్ల నిధులను మంజూరు చేయడంతో గురువారం అసెంబ్లీలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఈ రెండు కాల్వలు ఎప్పుడు పూర్తవుతాయా అని ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ఆయకట్టు కింద ఉన్న ఈ కాల్వలను పూర్తిచేయిస్తా అని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా యుద్ధప్రాతిపదికన పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను పూర్తిచేయిస్తామని చెప్పారని అన్నారు. బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ప్రాజెక్టుకు సంబంధించి కుడి, ఎడమ కాల్వల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, మరో రూ.70 కోట్లు నిధులు కావాలని అసెంబ్లీలో ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

## సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వబోమని ప్రకటించాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే సిమెంట్ పరిశ్రమను రామన్నపేటలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. గురువారం రామన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి అదానీతో లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయని, ఓటుకు నోటు కేసు నుంచి సీఎం, ఈడీ కేసు నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బయట పడేందుకు మోదీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రాహుల్, ప్రియాంక గాంధీలు మొట్టికాయలు వేస్తేనే సీఎం రేవంత్‌రెడ్డి.. అదానీ నుంచి రూ.100కోట్లు తీసుకోలేదని పేర్కొన్నారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై రెండునెలల క్రితం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించినా ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చేందుకు కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. రామన్నపేటలో అదానీ కొనుగోలు చేసిన భూముల చుట్టూ సర్వే నంబర్ 584లోని 127 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు బదలాయించి తద్వారా అదానీకి అప్పనంగా అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోర్టు సముదాయం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారని, ఇప్పుడు అక్కడ కాదని మరోచోట ఎందుకు స్థల పరిశీలన చేస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తోందని తనతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనేక సందర్భాల్లో నిరసనగళం వినిపించినట్లు గుర్తు చేశారు. రామన్నపేట మరో లగచర్లగా మారకముందే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని లేకుంటే ఈ ప్రాంత రైతులు, ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.

## పాతర్లపహాడ్ వాసికి అమెరికాలో గోల్డ్ మెడల్

- రెండేళ్ల ఎంఎస్ కోర్సు ఏడాదిలో పూర్తి



పృథ్వీకర్‌గౌడ్

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన దొంతగాని కరుణాకర్, అనంత దంపతుల ప్రథమ కుమారుడు పృథ్వీకర్ గౌడ్ అమెరికాలోని మిస్సోరి యూనివర్సిటీలో ఏ గ్రేడ్‌తో ఎంఎస్ పూర్తిచేసి గోల్డ్‌మెడల్ సాధించాడు. పృథ్వీకర్‌గౌడ్ రెండేళ్ల ఎంఎస్ కోర్సును ఏడాదిలోనే పూర్తిచేసినట్లు అతడి తండ్రి గురువారం తెలిపారు. సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన పృథ్వీకర్‌గౌడ్ 2020లో జేఎన్‌టీయూ నుంచి బీటెక్ సీఎస్ఈ విభాగంలో ఉత్తీర్ణుడై క్యాంపస్ సెలక్షన్స్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. 2023లో ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు.

## 22న ఆర్చరీ టోర్నమెంట్

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో ఆర్చరీ టోర్నమెంట్, సెలక్షన్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్. విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. విజయసాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22న ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ఆర్చరీ క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో అదే రోజు ఉదయం 8 గంటలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9912055678, 6300266493 నంబర్లను సంప్రదించాలని సూచించారు.







## నాలుగు రోజులు బ్యాంక్ సేవలు బంద్

భువనగిరిటౌన్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ)కు సంబంధించి తెలంగాణలోని బ్రాంచ్‌లన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం చేస్తున్నట్లు ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణలోని ఏపీజీవీబీ బ్రాంచ్‌లన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతోనే సేవలందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏపీజీవీబీ బ్యాంకు బోర్డులను తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ మార్పుల నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తెలంగాణలో ఏపీజీవీబీ సేవలు నిలిచిపోనున్నాయి. ఏటీఎంలు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంకు కార్యకలాపాలు పూర్తిగా స్తంభించనున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి బ్యాంక్ పాసుపుస్తకాలు, ఓచర్లు, డీడీలు, చెక్కు పుస్తకాలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతోనే జారీ చేస్తామన్నారు. ఇప్పటివరకు కొన్ని జిల్లాలకే పరిమితమైన ఈ బ్యాంకు బ్రాంచ్‌లను తెలంగాణ రాష్ట్రమంతా విస్తరింపజేయనున్నట్లు తెలిపారు.

## మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



స్వామి (ఫైల్)

రామన్నపేట: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నీర్నెముల గ్రామానికి చెందిన నోముల లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మయ్య పెద్ద కుమారుడు స్వామి(36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి 15ఏళ్ల క్రితం సౌందర్య అనే యువతితో వివాహం జరిగింది. వీరికి బాబు పుట్టిన కొద్దిరోజులకే సౌందర్య మృతిచెందింది. పది సంవత్సరాల క్రితం స్వామికి చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన శిరీషతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 17వ తేదీన స్వామి, అతడి భార్య పిల్లలతో కలిసి నేరడకు వెళ్లారు. మరుసటి రోజు స్వామి ఒక్కడే స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గురువారం భార్యకు ఫోన్‌చేసి నీర్నెములకు రమ్మని చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి తల్లి కిటికీలో నుంచి చూసి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే స్వామి మృతిచెందాడు. ఇంట్లో జరుగుతున్న గొడవలకు మనస్తాపం చెంది తన కుమారుడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతుని తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

## చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

బీబీనగర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం చెరువులో తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువు వద్దకు చేరకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు వెలికితీయగా గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతుడు నీలం రంగు జీన్స్ ప్యాంట్, కుడి చేతికి నల్లని దారం, స్టీల్ కడియం కలిగి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఐదు రోజుల క్రితం ఈతకు వచ్చి చెరువులో పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హనుమంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గురుకుల పాఠశాలలో బుధవారం వేడి రాగి జావ పడడంతో 8వ తరగతి విద్యార్థి శివరాత్రి శామ్యూల్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో విద్యార్థి మదన్‌కు స్వల్పగాయాలు, వంట మనిషి బోయ ఇందిరమ్మకు పాదాలు కాలిపోయిన విషయం విదితమే. వంట మనిషి విద్యార్థులకు అల్పాహారం అందించే విషయంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం ఉన్నట్లు గుర్తించి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ: మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన కోడితాల వెంకటేష్ తన ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో బుధవారం రాత్రి సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ బాలమణి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఉన్నత చదువులు చదివి.. చెడు వ్యసనాలకు బానిసై..

- గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన యువకుడు
- ఒక కేజీ 300 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్, రూ.2వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: ఉన్నత చదువులు చదివిన యువకుడు చెడు వ్యసనాలకు బానిసగా మారి గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. గురువారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ డీఎస్పీ రాజశేఖర రాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన సిరికొండ భానుప్రకాష్ డిప్లొమా(ఈఈఈ) పూర్తిచేశాడు. భానుప్రకాష్ తండ్రి ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందగా.. అప్పటినుంచి అతడు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అతడికి కోదాడకు చెందిన అఖిల్, డేంజర్ రాఘవులు పరిచయం అయ్యారు. వారిద్దరితో కలిసి భానుప్రకాష్ గతంలో ఆంధ్రా-ఒరిస్సా బోర్డర్‌లోని కూర్మనూర్ గ్రామంలో ఓ వ్యక్తి వద్ద 1.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో, మిర్యాలగూడ పట్టణంలో విక్రయించాడు. గంజాయి అమ్మగా డబ్బులు అధికంగా రావడంతో తక్కువ సమయంలో ఎక్కువగా సంపాదించాలనే ఆశతో గత నెల కూర్మనూరు గ్రామంలో 2.50 కిలోల గంజాయి రూ.12,500కు కొనుగోలు చేసి మిర్యాలగూడ పట్టణానికి తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి పట్టణంలోని బంగారుగడ్డ, ముత్తిరెడ్డికుంట, సుందర్‌నగర్‌కు చెందిన యువకులకు విక్రయించాడు. అంతేకాకుండా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన యువకుడికి కూడా 50 గ్రాములు విక్రయించాడు. మిగిలిన గంజాయిలో కొంత హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఇంకా మిగిలిన గంజాయిని ఒక సంచిలో పెట్టుకుని గురువారం కోదాడ నుంచి లారీలో మిర్యాలగూడకు వచ్చి తడకమళ్ల రోడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. అక్కడే ఉన్న పోలీస్ వాహనాన్ని చూసి పారిపోతుండగా వన్ టౌన్ ఎస్ఐ సుధీర్‌కుమార్ పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న సంచిని పరిశీలించగా అందులో ఒక కేజీ 300 గ్రాముల గంజాయిని గుర్తించారు. గంజాయితో పాటు సెల్‌ఫోన్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని, అతడిని పోలీస్ కస్టడీలోకి తీసుకుని మరింత సమాచారం తెలుసుకోవాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వన్ టౌన్, టూ టౌన్ సీఐలు నాగార్జున, కరుణాకర్, ఎస్ఐ సుధీర్‌కుమార్, కానిస్టేబుళ్లు చందా వెంకటేశ్వర్లు, హుస్సేన్, శ్రీను, తమీజుద్దీన్, వీరబాబు, నర్సింహ తదితరులున్నారు.

# ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు, కార్లు

- రెండు కార్లు, 16 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్: బైక్‌లు, కార్లను చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను గురువారం సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద సూర్యాపేట పట్టణ సీఐ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని విచారించగా సికింద్రాబాద్‌లోని ఇందిరమ్మనగర్‌కు చెందిన కొరపాటి నర్సింగ్‌రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మన్యం జిల్లా పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన బాత ప్రసాద్‌గా గుర్తించారు. వీరిద్దరు కలిసి కార్లు అద్దెకు తీసుకుని మార్గమధ్యలో డ్రైవర్ తో కలిసి మద్యం తాగి డ్రైవర్ మత్తులోకి వెళ్లగానే కార్లు దొంగతనం చేసేవారు. అంతేకాకుండా కార్లు, బైక్‌లపై వెళ్లే వారిని లిఫ్ట్ అడిగి మార్గమధ్యలో పని నిమిత్తం వాటిని ఆపిన క్రమంలో అదును చూసి దొంగతనం చేసేవారు. ఇలా 2 కార్లు, 4 బైక్‌లను దొంగతనం చేశారు. నిందితుడు ప్రసాద్‌పై గతంలో విశాఖ పట్టణంలో మూడు కేసులు ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. అదేవిధంగా వాహనాల తనిఖీల్లోనే భాగంగా హుజూర్‌నగర్‌కు చెందిన గుంగంటి శ్రీకాంత్ కూడా అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని కూడా పట్టుకొని విచారించగా.. కళాశాలలు, హాస్పిటల్స్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలనే లక్ష్యంగా చేసుకొని నకిలీ తాళాలతో చోరీ చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నాడు. శ్రీకాంత్ వద్ద 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న డీఎస్పీ రవి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎస్ఐలు ఆంజనేయులు, ఏడుకొండలు, కుశలవ, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డ్ అందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.